క్లుప్తంగా

గోవుల పేడ వేలం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలో గుట్టపై వెలిసిన శ్రీదేవి, భూదేవి శ్రీవేంకటేశ్వర స్వామి గోశాలలో ఉన్న గోవుల పేడను ఆదివారం గ్రామంలో బహిరంగ వేలం వేస్తున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. దాదాపుగా గోవుల పేడ 20 ట్రాక్టర్ల వరకు అవుతుందన్నారు. మండల పరిధిలోని రైతులు ఈ వేలంలో పాల్గొనవచ్చన్నారు. గ్రామంలోని రచ్చకట్ట వద్ద 8 గంటలకు వేలం ఉంటుందన్నారు.

రోడ్డు ఏర్పాటు చేయాలి



పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌లో వివిధ రంగాల్లో డ్రైవర్లుగా పనిచేస్తున్న డ్రైవర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రవాణారంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గీత, చేనేత, బీడీ కార్మికులకు జీవనభృతి నెలకు రూ.4,500 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దశరథం, శంకర్, నిరంజన్, బొజ్జన్న, రవికుమార్, శివకుమార్, వెంకటస్వామి, పాండు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం నిర్వహించుకోవాలి



లింగాల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ వరకు మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడుకలను జరుపుకోవాలని సూచించారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను పిల్లల తల్లులకు తెలియపర్చాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యమ్మ, సునిత పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిరుమలాపురంలో గ్రామపంచాయతీ వాటర్‌మ్యాన్‌గా పనిచేస్తున్న సుధాకర్ శనివారం ఉదయం నీటి ట్యాంక్‌లో పడి ప్రమాదవశాత్తు మృతిచెందాడని బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లుతో కలిసి మార్చరీలోని మృతదేహానికి నివాళి అర్పించారు. పంచాయతీ కార్మికులు వెంకటయ్య, కృష్ణయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని కుర్మిద్ద గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీఓ వెంకట్ రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని పనులను పరిశీలించి నాణ్యతగా ఉండాలని కూలీలకు సూచించారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బాలరాజు, నిర్మల తదితరులు ఉన్నారు.

నియామకంపై హర్షం

మన్ననూర్: మైనార్టీలు ఆశించిన విధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన ఒబేదుల్లా కొత్వాల్‌కు మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 15 రోజుల కిందట అమ్రాబాద్ కాంగ్రెస్ మండల పార్టీ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గాన్ని కలిసి వినతి అందజేశామన్నారు. అందుకు స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్వాల్‌కు చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. వెంకటేశ్వర్లు, జాకీర్, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి



కల్వకుర్తి: విద్యార్థులు బాగా చదువుకొని 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం కోరారు. శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను చైర్మన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాధవిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, స్వరూప, గిరిజ పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



ఉప్పునుంతల పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్చంపేట రూరల్: పల్స్ పోలియో చుక్కలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్ కోరారు. శనివారం అచ్చంపేటలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది అశోక్ ప్రసాద్, శ్రీనివాసులు, హనుమంతు, శాంతా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై శనివారం సిబ్బంది మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 0–5 ఏళ్ల వయస్సులోపు చిన్న పిల్లలందరికీ తల్లిదండ్రులు విధిగా పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు. మండలంలో ఏర్పాటు చేసే మొత్తం 30 బూత్‌లో 136 మంది సిబ్బంది పాల్గొని 2,942 మంది చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని వైద్యాధికారులు బిక్కులాల్, శివలీల తెలిపారు. ఆదివారం మిగిలిపోయిన వారికి రెండు రోజులపాటు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తామని వైద్యాధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అశోక్‌ప్రసాద్, ఫార్మసిస్టు శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్యాధికారి డాక్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. 5 సంవత్సరాల పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయించుకోవాలని, మొదటి రోజు ఆదివారం పల్స్‌పోలియో బూతులో రెండవ రోజు, మూడో రోజు పల్స్ పోలియో బూతులలో వేయించుకోని వారిని గుర్తించి వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగా పల్స్‌పోలియో చుక్కలు వేస్తారన్నారు. సంతోష్‌అభిరాం, జ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.

కోడేరు: మండలంలో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ దశరథం అన్నారు. మండలంలో మొత్తం 3,898 మంది చిన్నారులు ఉన్నారని, ఆయా గ్రామపంచాయతీల వద్ద పిల్లలకు తమ సిబ్బందితో టీకాలు వేస్తామన్నారు. మండలంలో 25 పోలింగ్ కేంద్రాలు ఒక్క మొబైల్ టీం 96 మంది సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు. మూడు రోజుల పాటు పల్స్‌పోలియో చుక్కలు వేస్తామన్నారు.



వెల్దండలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ భీమానాయక్

బిజినేపల్లి: వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్యసిబ్బంది పక్కాగా నిర్వహించి విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్ సూచించారు. శనివారం ఉదయం లట్టుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రణాళిక ప్రకారం చిన్నారులకు టీకాలు వేయాలని, అందుకు ప్రత్యేకంగా గ్రామాల్లో చాటింపులు, లేదా సామాజిక మాధ్యమాల్లో ప్రకటన చేయాలని సూచించారు. వలస కార్మికుల చిన్నారులను గుర్తించి టీకాలు వేయాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ సందర్భంగా పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు పలు సూచనలు సలహాలు చేశారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

వెల్దండ: మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ భీమానాయక్ మాట్లాడారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు చుక్కల మందులు వేయించాలన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ర్యాలీ నిర్వహించి పోలియో చుక్కలు వేయించుకోవాలని నినాదాలు చేశారు. మండలంలో మొత్తం 42 బూత్‌లు, 4 రూట్లను నిర్వహించనున్నట్లు చెప్పారు. డాక్టర్ సర్వాప, సూపర్‌వైజర్లు మురళీకృష్ణ, లక్ష్మణ్, గోవర్ధన్, మధు, జానకి పాల్గొన్నారు.

చారకొండ: పల్స్ పోలియోను గ్రామాల్లో చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాఅధికారి మంజుభార్గవి తెలియజేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 20 బూత్‌ల వారీగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

చారకొండ: పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి మంజుభార్గవి అన్నారు. మండల కేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో ర్యాలీ నిర్వహించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

తాడూరు: మండల కేంద్రంలోని కుచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. 4వ రోజు శనివారం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు తెలిపారు. మొత్తం 131 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. తాత్కాలిక వైద్య కేంద్రంతో పాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పాదయాత్రికులకు సహాయ సహకారాలు



బిజినేపల్లిలో మందులు అందిస్తున్న సుధాకర్‌లాల్



అచ్చంపేటలో మజ్జిగ అందిస్తున్న సొసైటీ సభ్యులు

బిజినేపల్లి: మహాశివరాత్రి సందర్భంగా కర్ణాటక, మహబూబ్‌నగర్, ఇతర జిల్లాల నుంచి పాదయాత్రగా శ్రీశైలం క్షేత్రానికి తరలి వెళ్లే భక్తుల కోసం మండల యువజన సంఘాలు, వైద్యశాఖ వారికి ప్రత్యేక సహాయ సహకారాలు అందిస్తున్నాయి. యాత్రలో భాగంగా నడిచి వెళ్లే యాత్రికులకు లట్టుపల్లి, బిజినేపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ తెలియజేశారు. మంగనూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హాజరై వైద్య సిబ్బంది సేవా కార్యక్రమాలను పరిశీలించారు. యువజన సంఘాల వారు మజ్జిగ, తాగునీరు, పండ్లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

అచ్చంపేట రూరల్: పాదయాత్రగా శ్రీశైలం వెళ్తున్న శివభక్తులకు శనివారం అచ్చంపేటలో రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు, పండ్లు పంపిణీ చేశామని సొసైటీ అధ్యక్షురాలు చేపూరి జయమ్మ తెలియజేశారు.

మన్ననూర్: శివమాలలు ధరించి పాదయాత్ర చేస్తున్న భక్తులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మన్ననూర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అస్వస్థతకు గురవుతున్న వారికి ఉమామహేశ్వర కాలనీ సమీపంలో వైద్యాధికారి సుధాకర్ నేతృత్వంలో వైద్య సిబ్బంది పరీక్షలు చేయడంతో పాటూ మందులు అందజేస్తున్నారు.

తెలకపల్లి: శ్రీశైలం పాదయాత్ర ద్వార శ్రీశైలం వెళ్తున్న స్వాములకు రెడ్డపాకుల పరమేష్ పండ్లు పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో తెలకపల్లికి చెందిన పలువురు భక్తులు అన్నదానం చేశారు.

భక్తులు అడవి మార్గం నుంచి వెళ్లొద్దు..

మన్ననూర్: మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు అడవి మార్గం వెంట వెళ్లవద్దని డీఎఫ్‌ఓ రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు అటవీ క్షేత్ర అధికారి ఈశ్వర్ భక్తులకు సూచించారు. వేసవి కాలం కావడంతో అడవుల్లో అక్కడక్కడ మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. వన్యప్రాణులు ముఖ్యంగా క్రూర మృగాలు పెద్దపులులు, చిరుత పులులు, ఎలుగుబంట్లు అటవీ ప్రాంతంలో అధికమయ్యాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అటవీ మార్గంలో సంబంధిత అటవీశాఖ అనుమతులు లేకుండా వెళ్లడం చట్టరిత్యా నేరమన్నారు. అందుకు గానూ పాదయాత్రగా వెళ్లే భక్తులు రోడ్డు మార్గం వెళ్లాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం ప్రధాన రహదారిలో ధార బేస్‌క్యాంపు, ఫరహాబాద్, రాసుమళ్లబావి మూడు ప్రదేశాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించామని చెప్పారు. ఇది ఇలా ఉండగా.. ప్రధాన రహదారిలో అటవీ సిబ్బంది పెట్రోలింగ్‌తో పాటూ సీసీ కెమెరాల సాయంతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో భక్తులు, ప్రయాణికులు, వాహనాలు అటవీ పరిసర ప్రాంతంలో ఆపడంగాని ప్లాస్టిక్ వంటి వ్యర్థపదార్థాలు పడేయడం చేయరాదని సూచించారు.

గోవుల సంరక్షణే లక్ష్యంగా గోశాల ఏర్పాటు



గోవుకు పూజ చేస్తున్న అర్చకులు

ఉప్పునుంతల: గోమాతలను సంరక్షించడమే లక్ష్యంగా బృందావన గోశాల ఏర్పాటుకు సంకల్పించినట్లు గోశాల వ్యవస్థాపకుడు టీఎస్ అశోక్‌కుమారాచార్యులు తెలిపారు. శనివారం ఉప్పునుంతలకు సమీపంలోని తన వ్యవసాయ పొలంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించి శివభక్తులకు భోజన ఏర్పాటు చేశారు. గోశాల వద్ద శ్రీకృష్ణుడి ప్రతిమను నెలకొల్పి ప్రతి పౌర్ణమి రోజు హోమాలు, అర్చనలు చేయనున్నామని చెప్పారు. దాతలు గోవులను, పశుగ్రాసాన్ని దానం చేయాలని తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లుఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్‌యాకూబ్ ఈ నెల 1న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అమరగిరిలో స్వచ్ఛ భారత్

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని అమరగిరిలో నాలుగు రోజుల నుంచి పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ మార్క్‌పాలోనియస్ పచ్చదనం పరిశుభ్రత మరియు స్త్రీ విద్య ప్రాధాన్యతపై ప్రజలకు వివరించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ పుట్ట శ్రీనివాస్, అధ్యాపకులు శిరీష, ఎల్లప్ప పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

9 నుంచి మెగా కంటి వైద్యశిబిరం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో అనూష ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్(హైదరాబాద్) అధినేత జలంధర్‌రెడ్డి సహకారంతో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామంలోని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 10 రోజుల పాటు అత్యాధునిక మొబైల్ ఆపరేషన్ థియేటర్ సాయంతో గ్రామ ప్రధాన కూడలిలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి పరీక్షలు, అవసరం అయినవారికి కంటి ఆపరేషన్, మందులు పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అమ్రాబాద్ మండలంతో పాటూ నియోజకవర్గం ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పాడజాతి దూడకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

ఉప్పునుంతల: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను రైతులు తమ పశువులు, గేదెలకు విధిగా వేయించాలని పశువైద్యాధికారి నరేందర్ సూచించారు. శనివారం మండలంలోని వెల్టూరులో వైద్యాధికారి, సిబ్బంది 216 పశువులు, గేదెలకు టీకాలు వేశారు.

అమ్రాబాద్: సామూహిక ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో శనివారం అమ్రాబాద్ పశువైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని తిరుమలాపూర్(బీకే)లో పశువులకు టీకాలు వేశామని పశువైద్యాధికారి అనిల్‌కుమార్ తెలియజేశారు.

నరేందర్‌ను అభినందించిన గ్రామస్తులు



కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్‌కి చెందిన నరేందర్‌ను గ్రామస్తులు శనివారం అభినందించారు. ఇటీవల వెల్లడైన ఫలితాలలో నరేందర్ 3 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించాడు. నిరుపేద వ్యవసాయ కుటుంబానికి నరేందర్ గ్రామంలోనే 10వ తరగతి వరకు చదువుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంగ్లీషులో పీహెచ్‌డీ చేశారు. తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతి అందజేశారు. దీంతో సంబంధిత విద్యుత్ అధికారులను ఆదేశించడంతో శనివారం విద్యుత్ అధికారులు గ్రామంలో స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టి పూర్తి చేశారు.



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దేవాలయ అభివృద్ధికి కృషి



అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారం ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ మల్లురవికే ఇవ్వాలి

కోడేరు: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డా.మల్లురవికి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ లక్ష్మయ్య కోరారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడిన వ్యక్తి మల్లురవి అని అన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

తెలకపల్లి: కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ బండ పర్వతాలు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎలక్షన్ నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

మన్ననూర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రాకపోకలు చేసే వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని అమ్రాబాద్ ఎస్‌ఐ సురేష్ హెచ్చరించారు. శనివారం మన్ననూర్‌లోని అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రధాన రహదారిలో ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు చేస్తున్నాయని అన్నారు. అదేవిధంగా శ్రీశైలం రహదారి ఘాట్ రోడ్డు కావడంతో పాటూ అనేక మలుపులతో రహదారి ఉన్నందున వాహనదారులు జాగ్రత్తగా వాహనాన్ని నడపాలని సూచించారు. ప్రతి డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంగిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎంని కలిసిన మాజీ సర్పంచ్



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌కి చెందిన మాజీ సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను సత్కరించారు.

వెల్దండ: మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. సంజీవ్‌కుమార్, జంగయ్య యాదవ్ ఉన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో పేట ఉన్నత పాఠశాలలో శనివారం చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడారు. మేము ఉపాధ్యాయులై మా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం సంతోషకరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వసంత, క్రాంతికుమార్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్ ప్రాథమిక, లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పెద్దకొత్తపల్లి: చెన్నపురావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వయంపరిపాలనా దినోత్సవం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు తెలిపారు.

లింగాల: మండల పరిధిలోని పద్మన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో, అవుసలికుంట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు.



కోడేరు ప్రగతి విద్యానిలయం పాఠశాలలో..

స్వయం పాలనలో విద్యార్థులు..

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని సన్‌షైన్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

కోడేరు: మండల కేంద్రంలోని ప్రగతి విద్యానిలయం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు.

అచ్చంపేట రూరల్: మండల పరిధిలోని నడింపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్, పట్టణంలోని సుభాష్‌నగర్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు.



నడింపల్లిలో..



జటప్రోల్ పేట పాఠశాలలో..



లింగాల మండలం పద్మన్నపల్లిలో..



లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

గృహ సముదాయాలకు దూరంగా టవర్ నిర్మించాలి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లలో నిర్మాణం చేస్తున్న ఏర్‌టెల్ టవర్ గ్రామంలోని గృహసముదాయాలకు దాదాపుగా 500 మీటర్ల దూరంలో నిర్మాణం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల స్థాయి సీపీఎం నాయకులు టవర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో మూడు సంవత్సరాల కిందట ఏర్‌టెల్ టవర్ నిర్మాణం చేస్తుంటే గ్రామస్తులు అడ్డుకున్నారన్నారు. టవర్ గ్రామానికి దగ్గరలో ఉండటంతో ఇబ్బందులు వస్తాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి గ్రామస్తుల వినతి మేరకు గ్రామానికి దూరంలో నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే గ్రామస్తులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, రంగస్వామి, రామస్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.